
# వార్నింగ్

**- పసుపులేటి తాతారావు**



**యు**ద్ధం భీకరంగా సాగుతోంది. రణక్షేత్రం రాను రానూ రక్తసిక్తమై అరుణాంచితమవుతోంది. వైరిపక్షం హాహాకారాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోతోంది. దీపవర్ధన మహారాజు రెట్టించిన ఉత్సాహంతో శత్రుసేనలను చీల్చిచెండాడుతున్నాడు. అతని ధాటికి నిలువలేక ఎదుటి రాజు నిర్వీర్యుడవుతున్నాడు. హోరాహోరీగా సాగుతున్న పోరాటంలో దీపవర్ధన మహారాజు ప్రదర్శిస్తోన్న కరవాల స్వైర విహారాన్ని నిలువరించలేక అవతలి రాజు కాస్సేపటికి శక్తిహీనుడై దాసోహమన్నాడు.

దీపవర్ధనుడు చేత్తో ఖడ్గాన్ని ఆకాశంవైపు చూపించి విజయాట్టహాసం చేసాడు. సైన్యం యావత్తూ అతని చుట్టూ చేరి జయజయధ్వానాలు పలికారు. మరో రాజ్యం అతని సామ్రాజ్యంలో కలిసిపోయింది.

మరునాడే స్రవంతికా రాజ్యంమీద దండయాత్ర!

❖ ❖ ❖

తెల్లని మల్లెపూవు లాంటి నైటీ ధరించిన వింధ్య ట్యూబ్ లైట్ కాంతిలో ధగధగా మెరిసిపోతోంది. మదన బాధితురాలై మగని రాక కోసం పరితపిస్తోన్న ఆమె ప్రబంధ నాయకిలా ఉంది. మోకాళ్ళను దాటి క్రిందకి పాకిన ఆమె నల్లని వత్తయిన వాలుజడ తాచుపాములా ఉంది. జడపాయల మధ్యనుంచి సంపెంగ పూల పరిమళం గదంతా పరుచుకుంటోంది. స్నో రాసి పౌడర్ అద్దిన లేలేత చెక్కిళ్ళు తాటి ముంజుల్ని తలపింపజేస్తున్నాయి.

ఆమె భర్త వినయ్ మంచి స్ఫురద్రూపి. ఆరడుగుల ఎత్తుకి సమాన నిష్పత్తిలో బలమైన ఛాతీ, భుజ దారుఢ్యం కలిగినవాడు. గ్రీకు శిల్పంలా కనబడే బలమైన అందగాడు. నడకలోనూ, మాటలోనూ మృదువైన హుందాతనం తొణికిసలాడుతూ వాక్చాతుర్యంతో ఎలాంటి వాళ్ళనైనా ఆకర్షించగల చాకచక్యం కలిగినవాడు.

ఆ సుగుణాలకే మురిసిపోయి, పెళ్ళిచూపుల్లో ప్లాటయిపోయింది పాపం. అయితే ఇప్పుడా సుగుణాలే ఆమెని తరుచుగా భయాందోళనకి గురిచేస్తున్నాయి. ఏ వలపుగత్తె అతన్ని వలలో వేసుకుంటుందోనని అనుక్షణం వణికిపోతోంది. దానికితోడు అతని వాలకం కూడా ఈ మధ్య అదోలా ఉంటోంది. చేతల్లో మునుపటి అనురాగం కనిపించడం లేదు. మాటల్లో వెనుకటి లాలన వినిపించడంలేదు. అవాంఛితమైన మార్పేదో స్పష్టంగా గోచరిస్తోంది.

అందుకే అనుక్షణం దిగులుపడుతూ అలంకరణ విషయంలో మునుపటికన్నా మరికాస్త శ్రద్ధ తీసుకోసాగింది.

ఆఘమేఘాల మీద అతివేగంగా దుమ్మురేపుకుంటూ పరుగులుతీసి వచ్చాయి గుర్రాలు. అలసిసొలసి సొమ్మసిల్లి పోయాయి. మరింక పరిగెత్తలేమన్నట్టు వగర్చుతూ నిలబడ్డాయి. వాటి అలసటతో తమకేం సంబంధం లేదన్నట్టు రాజభటులు దిగి తమ గుడారాల్లోకి వెళ్ళిపోయారు.

అక్కడికి కాస్తంత దూరంలో విడిగా నిర్మించబడిన గుడారంలో...

"ప్రభూ... తమకో చిన్న విన్నపం..." భయపడుతూనే చిన్నగా సణిగాడు మహామంత్రి.

తల పైకెగరేసి దర్పంగా చూసాడు మహారాజు.

"దండయాత్రకి బయలుదేరి మాసం పైన పక్షం కావస్తోంది. ఇప్పటికే మన సైనికులు జవసత్వాలుడిగి శక్తిహీనులయ్యారు. ఇంకేమాత్రం యుద్ధం చేయగల స్థితిలో లేరు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా ముందుకు వెళ్ళడం శ్రేయస్కరం కాదని నా అభిమతం. తమ ఆజ్ఞ అయితే ఇప్పటి వరకూ లభించిన ఈ విజయ సంరంభాల్ని మన దేశ ప్రజలకు బహుమతిగా మోసుకుపోయి అందజేద్దామని మనవి చేస్తున్నాను" అన్నాడు మహామంత్రి.

రాజు తల పైకెత్తకుండా కనుబొమలు మాత్రం పైకి లేపి చూపు సారిస్తూ అడిగాడు. "అంటే, పరోక్షంగా యుద్ధ విరమణ చేయమని మాకు సూచిస్తున్నారా?" రవ్వంత కోపం ధ్వనించిందతని మాటలో.

మహామంత్రి తత్తర పడ్డాడు. "ప్రభువులవారు మన్నించాలి. నా ఉద్దేశ్యం..."

"ఇంక చాలు మహామంత్రిగారూ. అరివీర భయంకరమైన మా శౌర్యపరాక్రమాలతో సాధించిన ఈ విజయాలు మాలో రేకెత్తించిన విజయోత్సాహం ఇక్కడితో చల్లారిపోకూడదు. మా చిరకాల వాంఛ అయిన ఆ స్రవంతికా రాజ్యాన్ని కూడా కైవసం చేసుకునే కల ఇన్నాళ్ళకి ఫలించబోతోంది. వేడిలోనే వేడి ఉద్భవించాలి. సైనికులు విజయగర్వంతో ఉరకలు వేస్తున్నారు. ఈ వేడి చల్లారిపోతే ఆ ఉత్సాహం మళ్ళీ రాదు. మమ్మల్ని కర్తవ్య విముఖుల్ని చేయాలని చూడకండి" అన్నాడు రాజు వాడిగా, వేడిగా.

స్రవంతికా రాజ్యం అనే మాటని ఉచ్ఛరిస్తున్నప్పుడు అతని కళ్ళు అరమోడ్పులయ్యాయి. కంఠంలో తన్మయత్వం ద్యోతకమైంది. ఆ రాజ్యాన్ని ఆక్రమించడం అతని చిరకాల స్వప్నం. ఇన్నాళ్ళకు ఫలించబోతుందన్న ఆనందం అతని ముఖంలో కదలాడింది.

మహామంత్రి భారంగా నిట్టూర్చాడు. ఈ రాజులతో వచ్చిన చిక్కే ఇది. శౌర్యం, పరాక్రమం అంటూ ఆవేశం ప్రదర్శిస్తారే తప్ప ఆలోచన అనేది రవ్వంతైనా ఉండదు. మూర్ఖత్వంతో ముందుకెళ్ళడం తర్వాత దిక్కుతోచక బెంబేలెత్తడం. స్రవంతికా రాజ్యాన్ని కవ్వించడం అంటే కొరివితో తల గోక్కోవడమే. ఇప్పుడు తమకున్న బలగాన్ని ఆ దేశ బలగాలతో పోల్చినా, ఆ రాజు శౌర్యపరాక్రమాల్ని, ఇరుగుపొరుగు రాజులతో అతనికున్న సత్సంబంధాల్ని పరిగణనలోకి తీసుకున్నా తేలేదొక్కటే. ఇప్పట్లో ఆ దేశంమీద దండెత్తడం అవివేకంతో కూడుకున్న పని అని. కాదని మొండిగా దండెత్తితే భంగపాటు తప్పదు. కానీ ఆ మాటంటే మహారాజు వినడు. ఉడుకు నెత్తుటి ఉన్మాదం విననీయదు.

చేసేదేం లేక మిన్నకుండిపోయాడు మహామంత్రి.

కాలింగ్ బెల్ మోగగానే ఛెంగున దూకుతూ వెళ్ళి తలుపు తీసింది వింధ్య. ఎదురుగా ఆమె మనోరథుడు, నవ మన్మధుడు. చిరునవ్వుతో ఆహ్వానించింది.

"ఓహ్. వాటే స్మార్ట్ లుక్? దివినుండి భువికి దిగి వచ్చిన అప్సరసలా ఉన్నావు" అన్నాడు వినయ్ ఆమె బుగ్గమీద చిటికె వేస్తూ. ఆమె సిగ్గు పడింది- ఎంతో అందంగా!

"నిన్నిలా చూస్తుంటే స్నానం, భోజనం కూడా మానేసి డైరెక్ట్‌గా

కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

సబ్జెక్ట్‌లోకి దిగిపోవాలనిపిస్తుందోయ్. ఏమంటావ్?" అన్నాడు.

"అలా అయితే నీ చెమట వాసన భరించలేక నేను సబ్జెక్ట్ నుంచి విరమించుకోవాల్సి వస్తుందేమో" అన్నది కొంటెగా చూస్తూ.

"అమ్మో అది మొదటికే మోసం. అలా జరగడానికి వీల్లేదు. ఇప్పుడే రెండు నిముషాల్లో వస్తా" అంటూ బాత్‌రూమ్‌లోకి దూరాడు. నిజంగానే రెండు నిముషాల్లో వచ్చేసాడు.

"పద" అన్నాడు భుజం మీద చేయివేస్తూ.

"మరి భోజనం?" అని అడిగింది.

"అందుకే పదమంటున్నాను" అన్నాడు.

"డైనింగ్ రూమ్ అటు కదా?" అన్నది.

వినయ్ గుంభనంగా నవ్వాడు. "తెలుసులేవోయ్. నాకు కొందరు కొంటె కోణంగి ఫ్రెండ్స్ ఉన్నారు. వాళ్ళ మాటల వల్ల నేను కొత్తగా తెలుసుకున్నదేమిటంటే, గుప్త పరిభాషలో 'దాన్ని' కూడా భోజనమే అంటారట. పద భోంచేద్దాం" అన్నాడు.

వింధ్య బుగ్గలు నొక్కుకొని విడ్డూరంగా చూసింది. "ఏం ఫ్రెండ్స్‌రా బాబు? ఇలాంటివి కూడా మాట్లాడుకుంటారా? అయినా వాళ్ళ మాటలకేం కానీ, డైనింగ్ టేబుల్ దగ్గరికి నడవండి. ముందా భోజనం కానిస్తే కాని ఈ..." చటుక్కున నాలుక కరుచుకుంది.

అతను అల్లరిగా నవ్వేసాడు. "చూసావా? అనుకోకుండా నీకూ అదే భాష వచ్చేస్తోంది. మా మగవాళ్ళం పైకి తేలిపోతాం. మీరు లోలోపలే దాచేసుకుంటారు. అంతే తేడా" అన్నాడు ప్రేమగా దగ్గరికి లాక్కొని తమకంగా ముద్దులు కురిపిస్తూ.

అతని ప్రేమకి ఆమె వివశురాలైంది. మురిసిపోయింది. వెన్నలా కరిగిపోయింది. ఆ ప్రేమంతా అచ్చంగా తన ఒక్కదానికే సొంతమైతే ఎంత బావుణ్ణు?

కానీ ఆ వసుధ...?!

హఠాత్తుగా వసుధ గుర్తుకురాగానే ఆమె ముఖంలో నీలి ఛాయలు అలుముకున్నాయి. మనసంతా దిగులుగా అయిపోయింది. అది పైకి కనబడనీయకుండా చప్పున ముఖం తిప్పుకొని వంటింట్లోకి వెళ్ళిపోయింది. ఐదు నిముషాల్లో భోజనం సిద్ధం చేసింది.

ఇద్దరూ తృప్తిగా భోంచేసారు. పదార్థాలన్నీ రుచిగా ఉంటే భోజనం ఎవరికి తృప్తిగా ఉండదు?

"డాళింగ్, రేపు విజయవాడ ప్రయాణం ఉంది. ఉదయాన్నే లేపుతావా?" అన్నాడు నుదుటికి పట్టిన చెమటని పక్కనే పడివున్న ఆమె నైటీ అంచుతో తుడుచుకుంటూ.

ఆ మాట వినగానే వింధ్య కనుబొమలు ముడుచుకున్నాయి. "విజయవాడా?" అని అడిగింది అతని ముఖంలోకి పరీక్షగా చూస్తూ. ఆ చూపులో బేలతనం ఉంది. తన వస్తువు తనకి కాకుండా పోతుందేమో అన్న ఇన్‌సెక్యూరిటీ ఫీలింగ్ ఉంది.

కారణం వసుధ! పక్క అపార్ట్‌మెంట్‌లోనే ఉంటుందామె. చాలా అందంగా ఉంటుంది. చక్కగా తయారవుతుంది. ఆమె కట్టూబొట్టులోనే శృంగారమంతా వొలికినట్టుంటుంది. ఆమెతో మాట్లాడడానికే చాలామంది మగాళ్ళు ఆరాటపడుతుంటారు. ఆమె భర్త ఏక్సిడెంట్‌లో చనిపోయి రెండేళ్ళు కావస్తోంది. ఈమధ్యనే ఆమె ఆఫీసుకి సెలవు పెట్టి పిల్లల్ని తీసుకొని పుట్టింటికి వెళ్ళింది. ఆమె పుట్టినూరు విజయవాడ. సరిగ్గా అదే సమయంలో తన భర్తకి కూడా విజయవాడ ప్రయాణమవడం ఎందుకో ఆమెకు చేదుగా అనిపించింది.

"విజయవాడా? ఎందుకు?"

"ఫ్రెండ్ మేరేజ్ ఉంది."

"ఏ ఫ్రెండ్?"

"నీకు తెలీదు డాళింగ్. నా క్లోజ్ ఫ్రెండ్. వెళ్ళకపోతే బాగుండదు" అన్నాడు.

ఆమె నమ్మలేకపోయింది. అందుకు కారణం లేకపోలేదు. వసుధ తనతో మాట్లాడడానికి వచ్చినప్పుడల్లా వినయ్ ఆమె వంక దొంగచూపులు చూడ్డం ఆమె గమనించింది. ఆమెతో అవసరానికి మించి మాటలు కలపడం, మాట్లాడేటప్పుడు కంఠస్వరం ఎప్పటికన్నా హస్కీగా మారడం ఆమెని విస్మయపరచిన విషయాలు.

ఒకసారి ఏదో పని కల్పించుకొని వినయ్ ఆమె పని చేస్తున్న ఆఫీసుకి వెళ్ళి బాతాఖానీ చేసి వచ్చిన సంగతి కూడా ఆమెకి తెలిసింది. అదీ వినయ్ చెప్పితే కాదు, వసుధ చెప్పితేనే తెలిసింది. రానురాను ఆమె అందాన్ని తనముందే పొగిడేవరకూ వచ్చాడు. ఆమెనెలాగైనా ఇంప్రెస్ చేయాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. అది స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

ఇంతవరకూ ఏం లేకపోయినా ఇక ముందు వాళ్ళిద్దరూ ఎక్కడ దగ్గరవుతారో అని కలవరపడి ఛస్తుంటే ఇప్పుడు హఠాత్తుగా ఈ విజయవాడ ప్రయాణం ఒకటి.

హఠాత్తుగా వసుధ గుర్తుకురాగానే ఆమె ముఖంలో నీలి ఛాయలు అలుముకున్నాయి. మనసంతా దిగులుగా అయిపోయింది. అది పైకి కనబడనీయకుండా చప్పున ముఖం తిప్పకొని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఈ ప్రయాణం కేవలం కల్పితమే అని ఆమె నమ్మకం. అందుకే ఆమె అంతలా చలించిపోయింది.

పది నిముషాల్లోనే అతను నిద్రాదేవి ఒడిలో వాలిపోయాడు. ఆమెకి మాత్రం నిద్ర కరువైంది. మనసంతా దిగులుతో నిండిపోయింది. హృదయం వేదనతో దహించుకుపోయింది. భర్త అనేవాడు అన్ని విధాలా సరిపోయే భార్య ఉన్నా పరాయి స్త్రీ వ్యామోహంలో ఎందుకు పడతాడో అర్థం కాలేదామెకు.

తాను అందానికి తక్కువేమీ కాదు. అతని పట్ల తాను తీసుకునే శ్రద్ధలో కూడా లోపమేమీ లేదు. కరణేషు దాసి అన్నారు కాబట్టి ఒక దాసిలా అతనికి అన్ని సపర్యలూ చేసింది. భోజ్యేషు మాతలా ఎంతో ఆప్యాయంగా ముద్దలు కలిపి నోటికందించి తినిపించింది. శయనేషు రంభలా అతనికెలా ఇష్టమో తెలుసుకుని అలాగే పక్కమీద సుఖాన్ని పంచి ఇచ్చింది. అయినా ఈ పరస్త్రీ వ్యామోహమేమిటో అర్థం కాలేదామెకు.

భగవంతుడా, ఏమిటీ పరీక్ష? అందమైన కలల సౌధం లాంటి జీవితాన్నిచ్చి అదెక్కడ కూలిపోతుందోనన్న భయాన్ని కూడా దానితోపాటే ఎందుకిస్తావు? నీకిదేం ఆనందం? దీనికి పరిష్కారం లేదా? అని మూగగా రోధించింది.


దేవుడు ఆమె మొర విన్నాడో ఏమో? ఆ రాత్రే ఆమెకు పరిష్కారమార్గం తోచింది. అమలు పరిచింది.


❖ ❖ ❖

మహామంత్రి కంటి మీదకి కునుకురాలేదు. బాధ్యతాయుతమైన పదవి అతనిది. నిద్రెలా వస్తుంది? మహారాజూ, సైనికులు అంతా హాయిగా నిద్రిస్తున్నారు. లోకమంతా గాఢ నిద్రా పరిష్వంగంలో మునిగి తేలే వేళ అతను మాత్రం అటూఇటూ తన విడిది గుడారంలోనే పచార్లు చేస్తున్నాడు.

మహారాజుకేం ఎలాంటి నిర్ణయాలైనా తీసుకుంటాడు. దానివల్ల అమాయక ప్రజలు, సైనికులు బలి కాకూడదు. రాజు తీసుకునే అవకతవక నిర్ణయాలకు సంకెళ్ళు వేయడానికే మంత్రులున్నదీ, మంత్రాంగాలున్నదీ. అందుకే తన మస్తిష్కానికి పదునుపెట్టి, ఆలోచనలను మథించాడు. ఒక ఉపాయం తోచింది. వెంటనే దానికి కార్యరూపం రచించాడు.

(మిగతా 27వ పేజీలో)



(19 వ పేజీ తరువాయి)

వింధ్య ముఖం మునుపెన్నడూ లేనంత ప్రకాశవంతంగా వెలిగిపోతోంది. రోజువారీ పనుల్నే ఎంతో ఉత్సాహంగా చేసుకుపోతోంది. వంటింట్లోంచి హాల్లోకీ, హాల్లోంచి వంటింట్లోకీ ఆమె నడుస్తుంటే ఇంచుమించు నృత్యం చేస్తున్నట్టే ఉంది.

"వాట్ డాలింగ్, ముఖం రోజూకన్నా కళగా వెలిగిపోతోంది?" చెంప నిమురుతూ అడిగాడు వినయ్.

"సింగపూర్‌లో ఉంటున్న మా బావ వచ్చాడటండీ. ఇప్పుడే అమ్మ ఫోన్‌చేసి చెప్పింది. ఇవాళ మనింటికి వస్తున్నాడట. వాడూ నేను చిన్నప్పుడు ఎన్నెన్ని ఆటలాడుకున్నామో. వాడు వస్తున్నాడంటే అవన్నీ వరుసగా గుర్తుకు వస్తున్నాయి. ఎంత బాగుండేదో ఆ లైఫ్?!" అన్నది కళ్ళు అరమోడ్పులు చేస్తూ.

వినయ్ ముఖంలో కళ తప్పింది. ఆలోచనలో పడ్డాడు. భార్యలో అతను చూస్తున్నది కొత్త పరిణామం. మరో వ్యక్తి గురించి, అది ఎవరైనా కానీయ్, మాట్లాడుతూ ఆమె అంతగా సంతోషం చూపడం ఇది వరకెప్పుడూ అతను చూడలేదు.

"అన్నట్టు... ఇవాళ మీకు విజయవాడ ప్రయాణముంది. త్వరగా తెమలండి. ఆలస్యమైతే మళ్ళీ టెన్షన్ పడతారు" అంటూ తొందర చేసింది.

"ఆ... అవునవును..." అంటూ బాత్‌రూంలోకి వెళ్ళాడు.

* * *

"ఏమండీ, టిఫిన్ చేయండి" ఉప్మా ప్లేట్ అందిస్తూ చెప్పింది వింధ్య.

వినయ్ అన్యమనస్కంగానే ఆ ప్లేట్ అందుకుని ఉప్మా తినసాగాడు.

"నేనన్నది మీ కొంటె కోణంగి స్నేహితులు చెప్పి ఉంటారే, ఆ టిఫిన్ గురించి" అన్నది.

వినయ్‌కి పొలమారింది. మంచినీళ్ళ గ్లాసు అందుకుని గటగటా తాగేసాడు. "నేన్నీకు 'భోజనం' గురించి చెప్పాను. 'టిఫిన్' అన్నమాట ఎలా తెలుసు?" అని అడిగాడు.

"మీరు మరీను. కొంటెకోణంగి ఫ్రెండ్స్ మీకేనా? మాకుండకూడదా ఏం?" అన్నది నవ్వుతూ.

"నిజమే నిజమే" అన్నాడు అన్యమనస్కంగానే టిఫిన్ ముగిస్తూ.

ప్రతీరోజూ ఇంట్లోంచి బయటికి వెళ్ళేటప్పుడు వినయ్‌కి ఎంతో గర్వంగా ఉండేది. తాను బయటికి వెళ్తున్నందుకు భార్య ముఖంలో కనిపించే దిగులు చూడ్డం వల్ల. కానీ ఈరోజు అలా గర్వపడడానికి వీల్లేకపోయింది. ఆమె ముఖంలో దిగులు లేకపోగా తానెంత తొందరగా బయటికెళతానా అని ఆమె ఎదురుచూస్తున్నట్టుగా అనిపించిందతనికి. అన్యమనస్కంగానే 'బాయ్' చెప్పి వెళ్ళిపోయాడు.

"అవును ప్రభూ. పశ్చిమ దిక్కునుంచి బహమనీ సుల్తానులు దొంగదెబ్బ తీసారు. తమరు రాజ్యంలో లేరని తెలుసుకుని మన రాజ్యం చుట్టూ తమ సైన్యాల్ని మోహరించి ఉంచారు. మనం వెంటనే బయల్దేరాలి."

* * *

మహారాజు తెల్లవారుఝామునే లేచి కరవాలాన్ని చేతికి తీసుకొని ఆరుబయటికి వెళ్ళిపోయాడు. పదునైన ఖడ్గాన్ని గాల్లోకి తిప్పుతూ సాధన చేయసాగాడు. సూర్యోదయం అయ్యే వేళకి సైన్యమంతా సంసిద్ధమైపోయింది, స్రవంతికా రాజ్యం మీదకి దండయాత్ర నిర్వహించడానికి. .

ఇద్దరు వేగులు పరుగుపరుగున వచ్చి మహామంత్రి చెవిలో ఏదో ఊదారు. అతని కనుబొమలు ముడుచుకున్నాయి. ముఖంలో ఆందోళన అలుముకుంది. వేగులు తీసుకువచ్చిన వార్తని మహారాజుకి విన్నవించాడు.

మహారాజు ఉలిక్కి పడ్డాడు. "ఏమిటి?" అన్నాడు నిఠారుగా అవుతూ.

"అవును ప్రభూ. పశ్చిమ దిక్కునుంచి బహమనీ సుల్తానులు దొంగదెబ్బ తీసారు. తమరు రాజ్యంలో లేరని తెలుసుకుని మన రాజ్యం చుట్టూ తమ సైన్యాల్ని మోహరించి ఉంచారు. మనం వెంటనే బయల్దేరాలి."

"ఎంత సాహసం?" అన్నాడు మహారాజు మీసం మెలి తిప్పుతూ.

"చిత్తం" అన్నాడు మహామంత్రి- నిర్ణయం తమదే అన్నట్టు చూస్తూ.

రాజు రెండుక్షణాలు ఆలోచించాడు. "స్రవంతికా రాజ్యంమీద దండయాత్రని మేము తాత్కాలికంగా ఉపసంహరించుకుంటున్నాం. వెంటనే సైన్యాన్ని వెనక్కి మరలించండి" అంటూ ఆజ్ఞ జారీచేసాడు తన ప్రత్యేక మందిరంలోకి దారితీస్తూ.

తన ఎత్తు సజావుగా పారినందుకు మంత్రి లోలోపలే సంతోషించాడు. కపటంతోనే అయినా రాజ్యాన్నీ, ప్రజల్నీ కాపాడవలసిన గురుతరమైన బాధ్యత తన మీద ఉందని అతనికి తెలుసు. అదే చేసాడు.

* * *

"అరే, ఏమిటి వెనక్కి తిరిగి వచ్చేసారు? విజయవాడ వెళ్ళలేదా?"

"లేదు. అనుకోకుండా ప్రయాణం కాన్సిల్ అయింది. పెళ్ళి అనివార్య కారణాల చేత మరో రోజుకి పోస్ట్‌పోన్ అయ్యిందట. ఇప్పుడే మొబైల్‌కి ఫోన్‌చేసి చెప్పాడు. అందుకే తిరిగొచ్చేసాను" అన్నాడు. అది వింధ్య ఊహించిందే కాబట్టి అట్టే ఆశ్చర్యపోలేదు!

"అయితే ఆఫీసుకి వెళతారా?"

"లేదు. ఈ రోజుకి ఆఫీసుకి కూడా డుమ్మా కొట్టేస్తున్నాను" అన్నాడు కన్ను కొడుతూ.

ఆ రాత్రి...

"మీ బావ వస్తాడన్నావు? రాలేదేం?" అని అడిగాడు వినయ్ వింధ్య భుజమ్మీద చెయ్యివేస్తూ.

"స్రవంతికా రాజ్యం మీద దండయాత్ర జరగలేదు. తన రాజ్యానికి భంగపాటు ఏర్పడితే తప్ప పరాయి రాజ్యాలమీద కన్ను వేయడం మానలేదు మహారాజు" అన్నది వింధ్య.

"నేనడుగుతున్నది సింగపూర్ నించి వచ్చిన మీ బావ గురించి" అన్నాడు.

"నేను చెపుతున్నది టీవీలో వచ్చిన పాత తెలుగు సినిమా గురించి" అన్నదామె కవ్వింపుగా చూస్తూ.

ఆమె మాటల ధోరణి అతనికర్థం కాలేదు. బుర్ర గోక్కుంటూ చూసాడు అయోమయంగా. ఆమెకి మాత్రం బాగానే అర్థమయ్యింది, ముందు ముందు భర్త వేగానికి సంకెళ్ళు వేయాలంటే తానెలాంటి స్ట్రాటజీలు అమలుచేయాలో.

- కార్యేషు మంత్రి హోదాలో. ★

**రచయిత చిరునామా:**
పి.తాతారావు,
అసిస్టెంట్ మేనేజర్,
ఆంధ్రా బ్యాంక్, జోనల్ ఆఫీస్,
ఆర్.ఆర్.పేట, ఏలూరు.

